# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 158 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 04 జూన్ 2026


## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



3లో

## రాత్రి వచ్చిన ఫోన్ కాల్.. గంటల్లోనే మృతదేహం.. షరీఫుద్దీన్ కేసులో ట్విస్ట్





6లో

# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

## - టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం





### - యువతలో నైపుణ్యాలను తీర్చిదిద్దాలన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో మిగతా2లో...





## హైదరాబాద్‌లో మా ఇంటికి కూడా వెళ్లకూడదా..?

### తెలంగాణలో పోటీచేసేది అక్కడి భూమి పుత్రులే

### పవన్ కళ్యాణ్ మరోమారు స్పష్టీకరణ

**అమరావతి,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** మా ఇల్లు ఉన్న తెలంగాణకు నేను వెళ్లకూడదా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిలదీశారు. అమరావతిలో మాట్లాడిన సందర్భంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జనసేన నేతలు పోరుపెడితే అక్కడికి వెళ్లానని.. పుష్కర కాలం తర్వాత కూడా అంత ద్వేషం ఊహించలేదని జనసేన అధినేత వాపోయారు. తాను తెలంగాణ ప్రజలను ఉద్దేశించి చెడుగా మాట్లాడ లేదని, తెలంగాణ ముమ్మాటికీ ఆ ప్రాంత భూమిపుత్రులదేనని పవన్ స్పష్టం చేశారు. దేశంలో బతకడం మన హక్కు అని, కాలరాసే హక్కు ఎవరికీ లేదని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2024 వరకు ఎంతమంది తెలంగాణ కాంట్రాక్టర్లు ఏపీకి రాలేదని పవన్ ప్రశ్నించారు. కేటీఆర్ తనకు సోదరుడు లాంటివారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీ నుంచి వెళ్లి తెలంగాణలో ఎవరూ పోటీ చేయడం లేదని.. జనసేనలోని తెలంగాణ భూమిపుత్రులే అక్కడ పోటీ చేస్తామంటున్నారని -పవన్ కల్యాణ్ చెప్పారు. విభజించుకుంటూ వెళ్తే ఎక్కడికి మిగతా2లో...



## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

### - నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్

**న్యూఢిల్లీ,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు మిగతా2లో...

## పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

### తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక

### ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు



2లో

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

### - 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

### - ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



**న్యూఢిల్లీ,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):**దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా మిగతా2లో...

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు


### - సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):**ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ మిగతా2లో...

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

### - రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అన్నం తినలేదన్నావ్
### - మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా..బిర్యానీ పెడతా...
### - మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా...
### - పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక



**హైదరాబాద్,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా.? మిగతా2లో...



## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

### జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

### మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి

**హైదరాబాద్,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. మిగతా2లో...

## కర్నాటక సిఎంగా డికె ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



**బెంగళూరు,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉప ముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మిగతా2లో...

# కర్నాటక సిఎంగా డికె ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిం దువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిం చిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వా మ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరిం చారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

(మొదటి పేజీ తరువాయి)

పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవు పలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

**తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక**

**ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు**



**హైదరాబాద్,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎలాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా...

వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# హైదరాబాద్‌లో మా ఇంటికి కూడా వెళ్లకూడదా..?

(మొదటి పేజీ తరువాయి)

వెళ్తామని, భూమికి సరిహద్దులు ఉంటాయని, మనసుకు ఉండవని పవన్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, తమిళనాడు వెళ్తే ఎక్కడా ఇబ్బందులు లేవని.. ఇదంతా సీఎం రేవంత్‌కు తెలిసి జరిగిందని అనుకోవడం లేదని పవన్ అభిప్రాయపడ్డారు. 'రాహుల్, ప్రియాంక వయనాడ్ వెళ్లి పోటీ చేయొచ్చా' అని పవన్ నిలదీశారు. దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించొద్దని హితవు పలికారు.

# నైజీరియా యువతకు శిక్షణ

## - రాష్ట్ర విత్తన రంగం ఉపకరిస్తుందన్న తుమ్మల



**హైదరాబాద్,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర విత్తన రంగ విశిష్ట అనుభవం, సాధించిన ప్రగతి నైజీరియా దేశపు యువతకు ఎంతగానో ఉపయోగపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ వేదికగా జరిగిన అంతర్జాతీయ విత్తన శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నైజీరియాలోని టరాబా రాష్ట్రానికి చెందిన యువతకు వారు శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఈ శిక్షణలో భాగంగా నైజీరియా యువతకు విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ వంటి కీలకమైన అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయం, విత్తన రంగాల్లో తెలంగాణ, రాబా రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో రైతులకు శిక్షణ ఇవ్వడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం వంటి రంగాలలో కూడా పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగానే తెలంగాణ టరాబా రాష్ట్రాల మధ్య 'స్టర్ స్టేట్'ఒప్పందంపై ప్రాథమిక చర్చలు జరిగాయని వివరించారు. ప్రస్తుతం తెలంగాణ విత్తన రంగం సాధించిన ప్రగతితో యావత్ భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇక్కడి అంతర్జాతీయ స్థాయి శిక్షణ ద్వారా నైజీరియా యువత ఎంతో విలువైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకున్నారని అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య: బడిబాట గ్రామసభలో సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు

**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలంలోని మంచినీళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం (03-06-2026) బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామసభ సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. దిలీప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి సంవత్సరం మంచినీళ్లపల్లి పాఠశాల విద్యార్థులు వంద శాతం గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడం ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన విద్యాలయాల ఏర్పాటుకు భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీట్లు సాధించిన విద్యార్థులు మంద రేవంత్,



ఎల్లావుల జన్వితలను వారి తల్లిదండ్రులతో కలిసి ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఆర్థిక సహాయం అందజేసి, ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రతి సంవత్సరం తనవంతుగా ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు. బడిబాటలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. గ్రామంలోని విద్యార్థులందరూ మంచినీళ్లపల్లి పాఠశాలలోనే చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాల



అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం విద్యార్థులను గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందేలా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు గర్వకారణమని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఉమాశంకర్, వార్డు సభ్యులు పంజాల సురేష్-స్వప్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గొర్రె కుమార్, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకట సాయి నగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల మంజూరుకు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన అధ్యక్షులు విజయేందర్ రెడ్డి

**ఉప్పల్ జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** వెంకట సాయి నగర్ కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు ఏ. విజయేందర్ రెడ్డి కాలనీ గౌరవ సభ్యులు, టీం సభ్యులు కలిసి ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీలో సరైన రోడ్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రహదారులు పూర్తిగా బురదమయంగా మారి ప్రజలు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు జారి పడే ప్రమాదం కూడా అధికంగా ఉందని ఎమ్మెల్సీ



దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల కు అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సీసీ రోడ్ల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, రవికుమార్, సంజీవ్, ఐలేష్ యాదవ్, రమేష్ యాదవ్, శంకర్, రమేష్ శెట్టి, గోపాల్, సర్వ సత్తయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఆర్. గోవింద్, జి. అశోక్, బి. చలపతి రావు, సి.హెచ్. శ్రీనివాస్ గౌడ్, కొల్ల నవీన్ కుమార్, భూపతి నరసింహ, విద్యాసాగర్, రామకృష్ణ, శివ, బాల కొమురయ్య, నరేష్, జగన్, స్వామి, చంద్రం చారి, గణేష్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు సహించం: హెచ్.ఆర్. మోహన్

### గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని పవన్ కళ్యాణ్‌కు డిమాండ్

**ఉప్పల్, జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం వేలాది మంది అమరుల త్యాగాలు, విద్యార్థుల బలిదానాలు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, కళాకారులు మరియు ప్రజల సుదీర్ఘ పోరాట ఫలితంగా ఏర్పడిన పవిత్ర గడ్డ అని కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం అధికార ప్రతినిధి హెచ్.ఆర్. మోహన్ పేర్కొన్నారు. తెలంగాణ గురించి నిర్లక్ష్యంగా, అవమానకరంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదని ఆయన అన్నారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని హెచ్.ఆర్. మోహన్ ఆరోపించారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన ప్రజాకవి గద్దర్ గురించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన వారు ఈరోజు తెలంగాణ ప్రజలకు నీతులు చెప్పే స్థితిలో లేరని విమర్శించారు. తెలంగాణ సమాజం తన చరిత్రను, ఉద్యమాన్ని, అమరులను, సంస్కృతిని ఎల్లప్పుడూ గౌరవిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన యువత, విద్యార్థులు, ప్రజల త్యాగాలను తక్కువ చేసి మాట్లాడే ప్రతి ప్రయత్నాన్ని తెలంగాణ సమాజం ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా తిప్పికొడుతుందని అన్నారు. గద్దర్ కేవలం ఒక వ్యక్తి కాదని, తెలంగాణ ఉద్యమానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయనను అవమానించడం అంటే తెలంగాణ ప్రజల భావోద్వేగాలను అవమానించడమేనని అన్నారు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు, గద్దర్ అభిమానులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని



డిమాండ్ చేశారు. తెలంగాణ గడ్డపైకి వచ్చే ప్రతి నాయకుడు ఈ నేల చరిత్రను, ఉద్యమ వారసత్వాన్ని, ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వాభిమానాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం తీవ్రంగా ఖండిస్తోందని, ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి హెచ్.ఆర్. మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కరీంనగర్- జగిత్యాల జాతీయ రహదారికి లైన్ క్లియర్..! కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే ...

### ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండి సంజయ్ లకు కృతజ్ఞతలు తెలిపిన పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు....

**కరీంనగర్ జిల్లా జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ - జగిత్యాల జాతీయ రహదారికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అతిపెద్ద తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం రోజున జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో జగిత్యాల - కరీంనగర్ జాతీయ రహదారిని (ఎన్ హెచ్-563) 4 వరుసలుగా (4-లైన్లు గా) విస్తరించేందుకు కేంద్ర క్యాబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణం చేపట్టడం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. బండి సంజయ్ కృషితోనే నేడు కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారి సాకారం అవుతుందన్నారు. ప్రధానంగా



తెలంగాణలోని రెండు ప్రధాన రహదారుల విస్తరణకు (ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల మరియు జగిత్యాల-కరీంనగర్) కలిపి మొత్తం రూ.7,597.16 కోట్లను కేంద్రం కేటాయించిందని తెలిపారు. ఇందులో కేవలం జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ కోసమే రూ.2,395 కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపారు. దాదాపు 58 కిలోమీటర్ల పొడవుతో జగిత్యాల - కరీంనగర్ సెక్షన్‌ను(బిఓటి) పద్ధతిలో విస్తరించనున్నారని తెలిపారు. ఇందులో భారీ ట్రాఫిక్ ఉండే జనాభా ప్రాంతాలను తప్పిస్తూ కొత్తగా 34.96 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారని, . ఈ హైవేపై వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారనీ తెలిపారు.. ముఖ్యంగా ఈ 4 లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తే జగిత్యాల - కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాల పాటు కలిసి వస్తుందని, ఈ హైవే విస్తరణ వల్ల జగిత్యాల, పోతారం, గంగాధర, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తొలిగిపోనున్నాన్నరు. ఈ ప్రాజెక్ట్ పీఎం గతి శక్తి కింద రూపుదిద్దుకోవడం వల్ల కరీంనగర్, జగిత్యాల జిల్లాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి, ముఖ్యంగా స్థానిక వ్యాపారాలకు, రైతులకు తమ ఉత్పత్తులను రవాణా చేయడానికి ఎంతో మేలు చేకూరనుందన్నారు.

# కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య.. కేసు నమోదు

**చిట్యాల,జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఒక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి: హన్మకొండ జిల్లా, కమలాపూర్ మండలం, కన్నూరు గ్రామానికి చెందిన బోంత రాములు కుమార్తె గొల్లెన లక్ష్మి (25) కి 2016లో రేగొండ మండలం రేపక గ్రామానికి చెందిన గొల్లెన హరితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (కుమారుడు 8 సం॥, కుమార్తె 6 సం॥) ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నిన్న (02-06-2026) మధ్యాహ్నం భర్తతో గొడవపడిన లక్ష్మి, తీవ్ర మనస్తాపానికి గురై అక్కడి నుండి చిట్యాల వాళ్ళ మెనా మామ అయిన ఓర్సు రాజయ్య ఇంటికి వచ్చి చిట్యాల గ్రామానికి చెందిన అల్లం తిరుపతి ఎడ్ల కొట్టం వద్ద మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తరలించే లోపే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి బోంత రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ గారు తెలిపారు.

# వడదెబ్బతో వృద్ధుడి మృతి.. కేసు నమోదు



**చిట్యాల జూన్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల పరిధిలోని జూకల్ గ్రామానికి చెందిన మాశబోయిన రాజయ్య (65) అనే వృద్ధుడు వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల ప్రాంతంలో రాజయ్య చల్లగరిగ గ్రామ శివారులోని (సర్వే నంబర్ 360/A) తను కౌలు కి తీసుకున్న పొలంలో మక్కజొన్న చొప్ప కలపెట్టేందుకు వెళ్ళాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 11:30 గంటల సమయంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై, పక్కనే ఉన్న చెట్టు కింద స్పృహతప్పి పడిపోయాడు. ఇది గమనించిన సమీపంలోని వ్యక్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు మాశబోయిన రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ సతీష్ తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ





**హైదరాబాద్, జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నవభారత్ నిర్మాణ్ సంఘ్ - అధ్యక్షులు అడ్వకేట్ సురేపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "పర్యావరణ పరిరక్షణ దినోత్సవం" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ సామాజిక సేవకుడు అమూర్త్ కుమార్ జైన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో పర్యావరణ అవగాహన సదస్సు, కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు సందేశమిస్తూ సైకిల్ చలావో సెహత్ బచావో, పర్యావరణ్ కా రక్షా కరో"సైకిల్ తొక్కండి ఆరోగ్యాన్ని కాపాడండి, పర్యావరణాన్ని రక్షించండి" అని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యకర జీవన విధానానికి మద్దతుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, సామాజిక సేవా సంస్థలు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అమూర్త్ కుమార్ జైన్, అడ్వకేట్ సురేపల్లి రవికుమార్, అశోక్ హీరావత్, లయన్ గోపిశెట్టి ప్రమోద్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 49వ డివిజన్‌లో చీరల పంపిణి చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్



**కరీంనగర్ టౌన్ జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ49 డివిజన్ కార్పోరేటర్ అన్నం లక్ష్మి ప్రకాష్ చేతుల మీదుగా బుధవారం రోజు న మన సనాతన ధర్మం సేవా సమితి డివిజన్ కార్యాలయం వద్ద మహిళలకు చీరల పంపిణి కార్యక్రమం జరిగింది. 49వ డివిజన్లో ఓటు హక్కు , ఆధార్ కార్డు రేషన్ కార్డు ఉండి దారిద్ర రేఖకు దిగువన ఉన్న అర్హులైన పేదవారికి ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ తో , ఆర్ పి గాయత్రి, వార్డ్ ఆఫీసర్ మెండే శిరీష, డివిజన్ ప్రజలు విజయలక్ష్మి శారద ,మమత, కవిత, సులోచన సౌజన్య ,స్వరూప ,లావణ్య తో పాటు బిజెపి కార్యకర్తలు లంబు సుధాకర్ రెడ్డి గాదగోని రమేష్ భూమ్ రావు, నల్మచు సంతోష్ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైతుల ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తాం

## ప్రతిపక్షాలు ఆరోపణలు చేసిన, మొసలి కన్నీరు కార్చిన రైతులు ఎవరు నమ్మలేదు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**గంగాధర, జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం నాగిరెడ్డి పూర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే. రైతుల సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో 90 శాతం ధాన్యం కొనుగోలు చేసినట్లు, మరో మూడు నాలుగు రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం గంగాధర మండలం నాగిరెడ్డి పూర్ లో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు పై ప్రతిపక్షాలు ఎన్నో ఆరోపణలు చేశాయని, ధాన్యం కొనుగోలు చేయడం లేదని, లారీలు రావడంలేదని బురదజల్లే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా, మొసలి కన్నీరు కార్చినా రైతులు వారిని నమ్మలేదని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని సమస్యలను అధిగమించి జూన్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ధాన్యం సేకరణ పది రోజులు ఆలస్యమైనా రైతుల సహకారంతో సకాలంలో పూర్తి చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు నాలుగు రోజుల్లోనే ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాము,స్థానిక సర్పంచ్ గునుకొండ బాబు, ఆకుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కుంటపల్లి అంగన్వాడీ కేంద్రంలో బడిబాట



**గంగాధర, జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంఈరోజు గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికుంటపల్లి అంగన్వాడి కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా 3+పిల్లల గృహ సందర్శన చేసి పిల్లలను అంగన్వాడి కేంద్రానికి పంపించాలని కేంద్రంలో ఆటపాటలతో పాటు ఆంగ్లంలో బోధన నిర్వహిస్తామని చెప్పడం జరిగింది మరియు పిల్లలను నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ మాట అంగన్వాడి బాట అనే నినాదంతో ర్యాలీ తీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ , సూపర్వైజర్ గార్లు అంగన్వాడి టీచర్, తల్లులు పిల్లలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన...



**రామడుగు, జూన్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి నియోజకవరంలోని రామడుగు మండలం కోనేరుపల్లె నుంచి కొక్కెరకుంట మోతె బ్రిడ్జి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ రోడ్డు నిర్మాణ పనులకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు, రైతులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి

## అక్రెడిటేషన్‌తో సంబంధం లేకుండా ఇవ్వాలి

## ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి




**హైదరాబాద్ జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

**మద్దతు ప్రకటించిన కోదండరాం**

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్,సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఇతర పార్టీల ప్రలోభాలకు లోనై ఎంఐఎంను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి: సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్




**కరీంనగర్ టౌన్ జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, ఎంఐఎం పార్టీని బలహీనపరిచేందుకు కొందరు కార్యకర్తలు ఇతర రాజకీయ పార్టీల ప్రభావానికి లోనై పనిచేస్తున్నారని ఆరోపించారు. అయితే బ్యారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ సూచనల మేరకు యువతను ముందుకు తీసుకువచ్చి రాబోయే ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ జెండాను భుజాన మోసుకుంటూ కార్యకర్తలు చేసిన కృషి వల్లే నేడు కరీంనగర్‌లో ప్రతి వీధిలో ఎంఐఎం పేరు వినిపిస్తోందన్నారు. పార్టీని దెబ్బతీయాలని లేదా బలహీనపరచాలని ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటి వారిని పార్టీ పట్టించుకోదని హెచ్చరించారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

# ఉద్యమ త్యాగాలకు వెలకట్టగలమా?

## - ఆదుకోవడం ప్రభుత్వ భాధ్యత
## - సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి
## - తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు కొరకొప్పు రామారావు



**ఖమ్మం ప్రతినిధి, మే 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వరాష్ట్ర కాంక్షతో, ప్రాణాలను సైతం లెక్కచేయక నాడు తెలంగాణ ఉద్యమాన్ని ఉగ్రూతలూగించిన ఉద్యమకారుల త్యాగాలు వెలకట్టలేనివని, వారిని తక్షణమే ఆదుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు కొరకొప్పు రామారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలు అందించి, జైల్లపాలై, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించాలని కోరారు.

**హైకోర్టు ఆదేశాలను గౌరవించండి కాలయాపన వద్దు**

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకోసం నాడు యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎనలేని త్యాగాలు చేశారని రామారావు గుర్తుచేశారు. హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. జూన్ 2వ తేదీ నాటికి ఇచ్చిన 8 వారాల (90 రోజులు) గడువు ముగుస్తోందని, ఈ లోగా ఉద్యమకారుల హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 'కమిటీలు' పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యమకారుల జీవితాలతో ఆడుకోవద్దని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ముఖ్యమంత్రి నుండి స్పష్టమైన ప్రకటన వస్తుందని ఆశించామన్నారు. ఉద్యమకారుల ఆవేదనను, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం డిమాండ్లను అమలు చేయాలని కోరారు. నెలకు 25,000 రూపాయల పెన్షన్ మంజూరు చేయాలి. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇళ్ల స్థలాన్ని కేటాయించాలి. బస్సులు, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ఉద్యమంలో పాల్గొని ఉద్యోగాలు కోల్పోయిన నిరుద్యోగ ఉద్యమకారులకు ఉపాధి కోసం 10 లక్షల రూపాయల వరకు ప్రభుత్వ రుణ సౌకర్యం అందించాలన్నారు."ఉద్యమకారులను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీకి కష్టకాలమే. రాబోయే 2028 ఎన్నికల్లో ఉద్యమకారుల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందన్నారు. ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధన కోసం అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు కలిసి రావాలని రామారావు పిలుపునిచ్చారు. నాడు రాష్ట్రాన్ని సాధించిన తరహాలోనే, నేడు హక్కుల కోసం ఉద్యమకారులందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు.

# శ్రీ వాసవి కిట్టు పార్టీ ఆధ్వర్యంలో అధిక మాస వాయనం

**గంగాధర జూన్ 3 (పి సి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో ఈరోజు అధికమాసం సందర్భంగా శ్రీ వాసవి కిట్టు పార్టీ మహిళలందరూ వాసవి మాత పూజలో పాల్గొని అంగరంగ వైభవంగా కిట్టు పార్టీ మహిళలందరూ వాసవి మాత పారాయణం చేసి అధిక మాస వాయనము 33 రకాలు ఇచ్చినారు.ఇట్టి కార్యక్రమానికి గంగాధర మండలంలోని ఆర్యవైశ్య మహిళలందరూ పాల్గొని విజయవంతం చేసినారు.









# కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల బిఎల్ఏ-1గా గులాం అహ్మద్ హుస్సేన్‌ను నియమించిన ఎంఐఎం హైకమాండ్

**● ఎంఐఎం హైకమాండ్ నిర్ణయమే మాకు శిరోధార్యం ● పార్టీ నియామవళిని, క్రమ శిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు ● మునిగిపోయే నావలో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ● హైకమాండ్ ఆదేశాల పేరుతో ప్రజల చేతిలో తిరస్కారనికి గురైన వాళ్లు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దు ● ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎంఐఎం కార్యకర్తలు పకడ్బందీగా పాల్గొనాలి ● అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీకి కృతజ్ఞతలు తెలిపిన ఎంఐఎం నేత గులాం అహ్మద్**

**కరీంనగర్ టౌన్ జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ నిర్వహణ కోసం ఏఐఎంఐఎం పార్టీ ద్వారా ప్రతినిధిగా, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల బిఎల్ఏ-1గా కరీంనగర్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను, మంగళవారం ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంఐఎం పార్టీ కార్యాలయం కరీంనగర్ దారుస్సలాంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గులాం అహ్మద్ హుస్సేన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ భూపాలపల్లి జిల్లాల ఎస్ ఐ ఆర్ బిఎల్ఏ -1గా, ఎంఐఎం పార్టీ ప్రతినిధిగా తనను నియమించినందుకు, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీకి, గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంత పెద్ద గురుతరమైన బాధ్యత తనపై ఉంచినందుకు తమ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఎంఐఎం పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, కేవలం అసదుద్దీన్ ఓవైసీ గ్రూప్ మాత్రమే ఉంటుందన్నారు. పార్టీ హై కమాండ్ నిర్ణయమే, కమిటీకీ, కార్యకర్తలకు శిరోధర్యమన్నారు. పార్టీలో జూనియర్లు, సీనియర్లు ఎవరు లేరని, నగర కమిటీనీ, కార్యకర్తలను కలుపుకొని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీని విస్తృత స్థాయిలో బలోపేతం చేసి, బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు తాను అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ నియమావళిని, క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించబమన్నారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు మునిగిపోయే నావా అయినా టైటానిక్ పడవలో ప్రయాణం చేస్తున్నారని, వాళ్లు తీరు మార్చుకొని పార్టీ అభివృద్ధి కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. హై కమాండ్ ఆదేశాల పేరుతో కొందరు చేస్తున్న అబద్ధపు విష ప్రచారాన్ని ప్రజలు, పార్టీ క్యాడర్ నమ్మ వద్దన్నారు. ఏదైనా ఆదేశం హైదరాబాద్ హెడ్ క్వార్టర్ నుంచి కరీంనగర్ పార్టీ కార్యాలయానికి వస్తుందని ఏ కార్యక్రమం చేపట్టాలన్నా, ప్రతిఅంశానికి సంబంధించి కరీంనగర్ దారుస్సలామ్ లో ప్రెస్ మీట్ పెట్టి ప్రకటించిందే, ఫైనల్ అని చెప్పారు. ప్రజల చేతిలో తిరస్కారనికి గురై, ఓడిపోయిన కొందరు వ్యక్తులు, బుద్ధి మార్చుకోకుండా, కుట్రలు, కుతంత్రాలతో, హైకమాండ్ పేరుతో, పార్టీ పేరును వాడుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. ప్రజా జీవితంలో కార్పొరేటర్లుగా ఉన్నప్పుడు వీరు చేసిన తప్పులకు ప్రజలు వీళ్లను ఘోరంగా ఓడించారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులకు, పార్టీలో ఎటువంటి స్థానం ఉండదని, ప్రజల చేతిలో తిరస్కారానికి గురై, వాళ్లు చేసేదేమీ లేక పార్టీని నష్టపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఓడిపోయిన వ్యక్తులకు ఎంఐఎం పార్టీ ద్వారా గత 30 సంవత్సరాలుగా టికెట్లు ఇస్తే వాళు కోట్లాది రూపాయలు సంపాదించుకొని పార్టీ కోసం నయా పైసా




ఖర్చు చేయలేదని, ప్రజల కోసం కూడా వాళ్ళు ఏం చేయలేకపోయారని ఆరోపించారు. పార్టీలో కొత్తవారిని చేర్చుకొని పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రయత్నం చేస్తుంటే, ఓడిపోయిన వాళ్లంతా ఒక్కటై అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. గత రెండు రోజుల క్రితం చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ఎంఐఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలు వారికి లేకుండానే ఈద్ మిలాప్ కార్యక్రమం చేశారని, వాళ్లు చేసిన ప్రోగ్రాంకు విలువలేదన్నారు. ఎంఐఎం అభ్యర్థులను, మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఓడించిన, బిఆర్ఎస్ పార్టీ నాయకులను వెంటబెట్టుకుని చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమం, ఎంఐఎం బ్యానర్ పై చేయడం సిగ్గుచేటన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎంఐఎం కార్యకర్తలు పకడ్బందీగా పాల్గొని ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఎస్ ఐ ఆర్ లో ప్రజలకు వచ్చిన సందేహాలను, ప్రభుత్వ ఎన్నికల సంఘం ప్రతినిధులతో కలిసి నివృత్తి చేసేందుకు ఎంఐఎం పార్టీ ప్రతినిధులు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 390 బూతులలో సుమారు 1500 మంది బిఎల్ఏ-2లు సిద్ధంగా ఉన్నారని వివరించారు. గత ఏడు సంవత్సరాల నుండి కోట్లాది రూపాయల ఖర్చుతో, పార్టీ అభివృద్ధి కోసం పార్టీని ఉమ్మడి జిల్లాలో బలోపేతం కోసం కృషి చేశానని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ను నిర్ణయాత్మక శక్తిగా మార్చడానికి ఫుల్ టైం పార్టీ కోసం పనిచేస్తున్నట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, కోశాధికారి సయ్యద్ అడ్వకేట్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీ ఎంఏ సలీం, ఫసియుద్దీన్ ఖాలీద్, తాజుద్దీన్, మాజీ కార్పొరేటర్లు అరిఫ్ అహ్మద్, లింగపల్లి శ్రీను, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, అబ్దుల్లా ఖాన్, కంటేస్టేడ్ కార్పొరేటర్లు వాజిద్ అలీఖాన్, అబ్దుల్ గఫ్ఫార్, సురేశ్, మజారోద్దీన్, అక్బర్ అలీ, గాలి రాజు, మేరాజోద్దీన్, అసదుల్లా బేగ్, డివిజన్ల అధ్యక్షులు సాజిద్, అవేజ్, మీర్జా పాషా, సలీం, సల్మాన్, మస్తాన్ వలి, ముస్తఫా, ఖమర్, ఖదీర్, మిస్కిన్, ఖమరొద్దీన్ షబ్బీర్ తో డివిజన్ల కమిటీ ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారికి ఘన సన్మానం



**హైదరాబాద్ జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీచారికి విశ్వకర్మ లెజెండరీ అవార్డు అందుకున్న సందర్భంగా అదేవిధంగా వారి కూతురు జూలూరు కావ్య శ్రీ దోస్తు ఫస్ట్ ప్లేస్ లో కోటి ఉమెన్స్ కళాశాలలో( చాకలి ఐలమ్మ మెమోరియల్ యూనివర్సిటీ) లో BSC(MLT) సీటు వచ్చిన సందర్భంగా బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ జూలూరు పుండరీ చారిని, జూలూరు కావ్య శ్రీ ని శాలువాతో సత్కరించారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా ఉద్యమ నాయకురాలు సరస్వతి, మా మేనకోడలు పోలోజు వకులేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాసంతో విద్యారంభం..చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది: ఎమ్మెల్యే కవ్వంపల్లి







**కరీంనగర్ జిల్లా జూన్3(పీసీడబ్ల్యూ న్యూస్):** పిల్లల విద్యా ప్రస్థానంలో అక్షరాభ్యాసం అత్యంత కీలకమైన తొలి అడుగని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత అక్షరాలు దిద్దించి వారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే, చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి చిన్నారి భవిష్యత్తుకు అక్షరాభ్యాసమే బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చిన్నారులకు మెరుగైన వసతులు, సురక్షితమైన వాతావరణంలో విద్యా, పోషకాహార సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమాధికారి ఎం. సరస్వతి, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. 78 మందికి రూ. 26.23 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీఅనంతరం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 78 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 26.23 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యం, ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్‌కు ఉత్తరాఖండ్ సీఎం అభినందనలు...

**- సీఎం పుష్కర్ సింగ్ ధామిని సన్మానించిన మేయర్ కోలగాని**






**కరీంనగర్ టౌన్ జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రోజున జరిగినఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇటీవల బిజెపి ఘన విజయం సాధించిన నేపథ్యంలో, మేయర్ గా అతి పిన్న వయసు కలిగిన కోలగని శ్రీనివాస్ నియామకం కావడం పట్ల సీఎం పుష్కర్ సింగ్ ధామి సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామికి కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. అలాగే సమావేశాలకు అతిథులుగా హాజరైన ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రులు సుబోధ్ ఉన్నియాల్, ప్రేమ్ చంద్ర అగర్వాల్ , మదన్ కౌశిక్ ,లోకసభ సభ్యులు (హరిద్వార్) త్రివేంద్ర సింగ్ రావత్ రాజ్యసభ సభ్యులుమహేంద్ర భట్, డా. ప్రేమ్ చంద్ర అగర్వాల్ (ఎమ్మెల్యే, ఋషికేశ్ నియోజకవర్గం) లను మేయర్ కోలగని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## కూరాకుల గోపి అకాల మరణం బాధాకరం

**- రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ**

**- గోపి మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటు**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం జిల్లా నాయకుడు కూరాకుల గోపి అకాల మరణం బాధాకరమని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపీ మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఆయన మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. తన సారథ్యంలో నిర్వహించిన పాపులర్ ఛానల్ న్యూస్‌లో కూరాకుల గోపీ ఎంతో నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేశారని సాదిక్ అలీ గుర్తు చేసుకున్నారు. వార్తల సేకరణలో నిజాయితీ, ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి, వృత్తి పట్ల అంకితభావంతో ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. సంస్థ అభివృద్ధికి గోపీ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గోపీ కేవలం సహచర జర్నలిస్టు మాత్రమే



కాకుండా ఆత్మీయ మిత్రుడని సాదిక్ అలీ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కలిసి పనిచేసిన వ్యక్తిని కోల్పోవడం తనకు వ్యక్తిగతంగా అపారమైన నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సలహాలు, సహకారం, స్నేహపూర్వక స్వభావం ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కూరాకుల గోపి మరణం జర్నలిస్టు సమాజానికే కాకుండా సమాజానికి కూడా తీరని లోటని సాదిక్ అలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపీ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన జ్ఞాపకాలు పాత్రికేయ లోకంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.



# అధికారుల నిర్లక్ష్యం: ఖాళీ కుర్చీలు.. వెలుగుతున్న లైట్లు, ఫ్యాన్లు!

**అంబర్‌పేట్ జిహెచ్ఎంసి 42 సర్కిల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో యథేచ్ఛగా విద్యుత్ వృధా...**







**హైదరాబాద్,జూన్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా ధనాన్ని పొదుపుగా వాడుకోవాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లోనే బాధ్యతారాహిత్యం కొరవడింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) అంబర్‌పేట్ 42 సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. సెక్షన్‌లో అధికారులు, సిబ్బంది ఎవరూ లేకపోయినా.. గదిలో లైట్లు, ఫ్యాన్లు నిరంతరాయంగా తిరుగుతూనే ఉన్నాయి. చూసేవారు లేక, ఆపేవారు కరువై ప్రభుత్వ విద్యుత్ భారీగా వృధా అవుతోంది. **ఖాళీ గదులు నిరంతర సరఫరా** క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం వల్లో లేదా ఇతర కారణాల చేతనో టౌన్ ప్లానింగ్ విభాగపు అధికారులు, సిబ్బంది తమ సీట్లలో లేరు. అయితే, తాము సీట్లలో లేని సమయంలో కరెంటు స్విచ్‌లు ఆపివేయాలన్న కనీస స్పృహ కూడా సిబ్బందికి లేకపోవడం గమనార్హం. గంటల తరబడి సిబ్బంది లేని ఖాళీ కుర్చీలకే ఫ్యాన్లు గాలి ఊపుతుండగా, లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. **ప్రశ్నిస్తున్న ప్రజలు:** సాధారణ ప్రజలు ఇళ్లలో చిన్న పొరపాటు చేసినా వేలల్లో కరెంట్ బిల్లులు వసూలు చేసే అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలా వందల యూనిట్ల విద్యుత్ వృధా అవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు? అని స్థానికులు, కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. **పట్టించుకోని ఉన్నతాధికారులు** ప్రభుత్వ నిధులను కాపాడాల్సిన బాధ్యత గల స్థానంలో ఉన్నవారే ఇలా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆఫీసు సమయం ముగిసినా లేదా సీట్లలో ఎవరూ లేకపోయినా విద్యుత్ పరికరాలను నిలిపివేయాలనే కనీస నియమాన్ని కూడా ఇక్కడ గాలికొదిలేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి, విద్యుత్ వృధాకు కారణమైన సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని, కార్యాలయాల్లో కరెంటు ఆదా చేసేలా కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆక్రమణలను తొలగించండి

**● పేదల పక్షాన పోరాటం తప్పదు ● సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ● ఎన్నెస్పి భూముల సర్వేను పరిశీలించిన సిపిఐ బృందం**




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా ప్రభుత్వ భూములు అక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొలగించకపోతే పేదలచే ప్రభుత్వ భూములు అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హవేలీ సిపిఐ కార్యాలయంలో జరిగిన హవేలీ శాఖ సమావేశం నానబాల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సంపన్నుల పట్ల, కబ్జాదారుల పట్ల మేతక వైఖరిని అవలంభిస్తుందన్నారు. నిలువ నీడ లేక కాలువలపై గుడిసెలు వేసుకున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించిందని ఈ ఖాళీ చేయడానికి ఎవరు కారకులో వారే ఇప్పుడు నాగార్జున సాగర్ కాలువ కట్టలను అక్రమిస్తున్నారని సురేష్ ఆరోపించారు. ప్రభుత్వం తమకు అండగా నిలబడుతుందని ఆక్రమణదారులు, కబ్జాదారులు విస్తృత ప్రచారం చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా యంత్రాంగం ఇదే రీతి అవలంభిస్తే పేదలను సమీకరించి ప్రభుత్వ భూములను అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి సిపిఐ ఫిర్యాదు మేరకు జరుగుతున్న ఆక్రమణలను సిపిఐ బృందం పరిశీలించింది. నీటిపారుదల శాఖ, కార్పోరేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం 12వ డివిజన్లో ఎన్నెస్పి కాలువ ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ అధికారులతో మాట్లాడుతూ నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యక్రమాల విజయానికి సమిష్టి కృషి అవసరం

# రాత్రి వచ్చిన ఫోన్ కాల్.. గంటల్లోనే మృతదేహం.. షరీఫుద్దీన్ కేసులో ట్విస్ట్

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:**



పరకాల పట్టణంలో చోటుచేసుకున్న షరీఫుద్దీన్ మృతి ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన మమ్మద్ షరీఫుద్దీన్ (36) హనుమకొండలోని ఓ ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తూ, కుటుంబంతో కలిసి పరకాల పట్టణంలో నివాసం ఉంటున్నాడు. అయితే మంగళవారం రాత్రి వచ్చిన ఓ ఫోన్ కాల్‌తో ఇంటి నుంచి బయటకు వెళ్లిన షరీఫుద్దీన్ తిరిగి ఇంటికి చేరకపోవడం, అనంతరం అతను మృతదేహంగా కనిపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, షరీఫుద్దీన్ మరణం సహజసిద్ధంగా జరిగిందనే కంటే ఇది పథకం ప్రకారం జరిగిన హత్యగా భావించే పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా చివరిసారిగా వచ్చిన ఫోన్ కాల్, అతను బయటకు వెళ్లిన పరిస్థితులు, అనంతరం జరిగిన పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక ప్రజలు ఘటన వెనుక అసలు కారణాలు వెలుగులోకి రావాలని కోరుతున్నారు. పరకాల పట్టణంలో గతంలో చోటుచేసుకున్న అనేక నేర ఘటనల మాదిరిగానే ఈ ఘటన వెనుక కూడా డబ్బు లావాదేవీలు లేదా వ్యక్తిగత సంబంధాల కోణం ఉండవచ్చనే చర్చ ప్రజల్లో సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేకపోవడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో, స్థానిక వర్గాల్లో అక్రమ సంబంధాల కోణం గురించిన ప్రచారం జరుగుతున్నప్పటికీ, దానిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఆధారాలు బయటకు రాలేదు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. షరీఫుద్దీన్‌కు చివరిసారిగా వచ్చిన ఫోన్ కాల్స్ వివరాలను సేకరిస్తూ, కాల్ డేటా రికార్డులు, మొబైల్ లొకేషన్, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కేసు ఛేదన కోసం ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని సమాచారం. ఈ సందర్భంగా పరకాల సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, కేసును అత్యంత ప్రాధాన్యంతో విచారిస్తున్నామని తెలిపారు. ఫోన్ కాల్ వివరాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ప్రస్తుతం కొన్ని కీలక ఆధారాలు లభించాయని, త్వరలోనే కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉందని పేర్కొన్నారు. షరీఫుద్దీన్ మృతి వెనుక అసలు కారణం ఏమిటి? ఇది ప్రమాదమా, ఆత్మహత్యా, లేక పథకం ప్రకారం జరిగిన హత్యా? అనే ప్రశ్నలకు సమాధానం కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఈ మిస్టరీకి తెరపడే అవకాశం ఉంది.

# సంజీవరెడ్డి భవన్లో మర్యాదపూర్వక భేటీ

**- మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు**



**కల్లూరు,జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని సంజీవరెడ్డి భవన్‌లో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యలను కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్లూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోట్రు అర్జున్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో కాంగ్రెస్ కార్యక్రమాల విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మద్దినేని శ్రీనివాసరావు, మద్దినేని గోపయ్య, మద్దినేని లోకేష్, మునిగంటి బాబు, రేపాకుల రామకృష్ణ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం, రానున్న రాజకీయ కార్యక్రమాల విజయవంత నిర్వహణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.



# అనాథలైన అమ్మలకు 'రక్షణ' నీడ..

**● కోదాడ హైవే చెంతన వృద్ధాశ్రమ స్థల పరిశీలన! ● త్వరితగతిన పూర్తికానున్న పునరావాస కేంద్రం ప్రాజెక్టు ● హర్షం వ్యక్తం చేసిన 'రక్షణ వెల్ఫేర్ సొసైటీ' బృందం**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కన్నవారున్నా కనుమరుగై.. అందరూ ఉండి కూడా అనాథలుగా మిగిలిపోయిన వయోవృద్ధులు, ఆసరా లేక అల్లాడుతున్న వృద్ధ మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'రక్షణ వెల్ఫేర్ సొసైటీ సంస్థ' గొప్ప సంకల్పంతో ముందుకొచ్చింది. ప్రకృతి వైపరీత్యాల వేళ తలదాచుకునేందుకు, నిరాశ్రయులైన వృద్ధ మహిళలకు అమ్మలాంటి భద్రతను అందించేందుకు ఒక అత్యాధునిక పునరావాస కేంద్రం (వృద్ధాశ్రమం) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం తన కార్యాచరణను శరవేగంతో ముందుకు తీసుకెళ్తోంది. అందులో భాగంగానే బుధవారం నాడు సూర్యాపేట జిల్లా, కోదాడ మండలంలోని హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న 1600 గజాల సువిశాల ప్రదేశాన్ని రక్షణ వెల్ఫేర్ సొసైటీ బృందం పరిశీలించింది. వృద్ధ మహిళలకు తమ సొంత ఇళ్లను మైమరపించే విధంగా, స్వచ్ఛమైన వాతావరణంలో అన్ని వసతులతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దబోతున్నారు. **అమ్మల కోసమే ఈ అక్షయ పాత్ర.. సొంత ఇళ్లను తలపించేలా నిర్మాణం!** ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు పోలేపల్లి సుజాత మాట్లాడుతూ.. నిరాశ్రయులైన వృద్ధులకు అండగా నిలవడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు, ప్రభుత్వ అనుమతులు ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన కార్యచరణను ఇప్పటికే వేగవంతం చేసినట్లు తెలిపారు.

"వయసు మళ్లిన కాలంలో వృద్ధులు మానసిక ప్రశాంతతను కోరుకుంటారు. అందుకే వారి సౌకర్యార్థం, అన్ని రకాల మౌలిక వసతులతో వారి సొంత నివాస సముదాయాలను తలపించే విధంగా భవనాన్ని నిర్మిస్తున్నాం. దీనికోసం నిపుణులైన సివిల్ ఇంజనీర్లు, ఇంటీరియర్ డిజైనర్లు మరియు ప్లానింగ్ ఆర్కిటెక్ట్‌లతో ప్రత్యేకంగా సమాలోచనలు జరిపి ప్రణాళికలు సిద్ధం చేశామని పోలేపల్లి సుజాత అన్నారు. వృద్ధులు, నిరుపేదలు, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పునరావాస కేంద్రం ఒక ఆశాదీపంగా మారనుందని నిర్వాహకులు తెలిపారు. కాగా, 'సీనర్జీ ఇండియన్ ఫౌండేషన్' అధినేత సామెర్ల కిరణ్ కుమార్ అండదండలు, నిరంతర సహకారంతోనే తాను ఈ సామాజిక సేవలను ఇంత సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నానని సుజాత కృతజ్ఞతాపూర్వకంగా వెల్లడించారు. అనాథలైన అమ్మల కన్నీళ్లు తుడిచేందుకు, వారి శేషజీవితానికి భరోసా ఇచ్చేందుకు రక్షణ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న ఈ మానవీయ ప్రయత్నం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సమాజంలో నిర్లక్ష్యానికి గురవుతున్న వృద్ధుల పట్ల పోలేపల్లి సుజాత చూపుతున్న సేవా నిరతి నిజంగా ఆదర్శప్రాయమంటూ పలువురు ప్రముఖులు ఆమెను మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నారు.

# నేనో కెప్ట్ బాయ్‌ఫ్రెండ్‌ని: లలిత్ మోదీ

సుస్మితా సేన్‌పై చాలా కాలంగా వస్తున్న రూమర్స్‌కి లలిత్ మోదీ ఎట్టకేలకు చెక్ పెట్టాడు. 2022లో సుస్మితా సేన్ – లలిత్ మోదీ రిలేషన్‌లో ఉన్నారు. అయితే, కేవలం డబ్బు కోసమే సుస్మితా సేన్ లలిత్ మోదీతో రిలేషన్‌లో ఉందని విమర్శలు వచ్చాయి. వాటన్నింటికీ చెక్ పెడుతూ సుస్మితా సేన్‌కు డబ్బు అవసరం లేదని, తాను చాలా సంపన్నురాలని మోదీ అన్నాడు. నిజం చెప్పాలంటే బయటకు వెళ్లినప్పుడు తానే ఖర్చు పెడుతుందని బయటపెట్టాడు. సంచలనాలతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ మరోసారి నెట్టింట హాట్ టాపిక్ అయ్యాడు. ఈ సారి తన మాజీ ప్రేయసి సుస్మితా సేన్ గురించి విషయాలను బయటపెట్టి అందరికీ షాక్ ఇచ్చాడు. లలిత్ మోదీ – సుస్మితా సేన్ రిలేషన్‌లో ఉన్నప్పుడు నెట్టింట ఎన్నో రూమర్స్ వచ్చాయి. ముఖ్యంగా సుస్మితా సేన్ డైమండ్ క్వీన్, గోల్డ్ డిగ్గర్ అంటూ కామెంట్స్ చేశారు. వాటన్నింటిని ఖండిస్తూ లలిత్ మోదీ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సుస్మితా సేన్ – లలిత్ మోదీ సన్నిహితంగా ఉన్న ఫొటోలు 2022 జూలైలో నెట్టింట వైరల్ అయ్యాయి. అప్పట్లో తామిద్దరం ప్రేమలో ఉన్నామని లలిత్ మోదీనే ప్రకటించడంతో అందరూ సుస్మితా సేన్‌పై గోల్డ్ డిగ్గర్ అంటూ విమర్శలు చేశారు. అప్పట్లో వచ్చిన విమర్శలను లలిత్ మోదీ ఇప్పుడు ఖండించాడు. సుస్మితా ఎవరి దగ్గర నుంచి ఏదీ స్వీకరించే వ్యక్తి కాదని, ఇద్దరూ కలిసి బయటకు వెళ్లినప్పుడు తానే ఖర్చు పెట్టేదంటూ హ్యూమన్స్ ఆఫ్ బాంబేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బయటపెట్టాడు. “సుస్మితా సేన్



అందమైన మహిళే కాదు.. చాలా సంపన్నురాలు కూడా. ప్రపంచంలో నాకు తెలిసిన వారిలో అత్యధిక వజ్రాలు కలిగిన వ్యక్తి కూడా ఆమె అయ్యుంటుంది అనుకుంటున్నాను. అవన్నీ ఆమె సంపాదించుకున్నవే. ఆమెకు డైమండ్ స్టోర్లు కూడా ఉన్నాయి. మేమిద్దరం కలిసి బయటకు వెళ్లినప్పుడు ఒక్కసారి కూడా నేను ఖర్చు పెట్టాల్సిన అవసరం రాలేదు. ప్రతీదానికీ ఆమే ఖర్చు పెడుతుంది. నిజానికి నేనే కెప్ట్ బాయ్‌ఫ్రెండ్‌లా ఉండేవాడిని. ఎవరైనా ఆమెను గోల్డ్ డిగ్గర్ అంటుంటే అది పూర్తిగా అవాస్తవం. నిజానికి నేను ఆమె విషయంలో డైమండ్ డిగ్గర్‌ని ఎందుకంటే ఆమె నిజంగానే ఒక డైమండ్ లాంటి వ్యక్తి. డబ్బు కోసం ఆమె నాతో రిలేషన్‌లో లేదు. ఆమెకు కావాలంటే ప్రపంచంలో ఎవ్వరినైనా ఎంచుకునే స్థోమత ఉంది. ఆర్థికంగా చాలా బలమైన మహిళ.. ఎవరి నుంచి ఏదీ స్వీకరించేది కాదు” అని అసలు నిజాన్ని లలిత్ మోదీ బయటపెట్టాడు. లలిత్ మోదీ 2022లో సుస్మితాను తన బెటర్ హాఫ్‌గా పేర్కొనడంతో ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని అందరూ అనుకున్నారు. కానీ కేవలం డేటింగ్ మాత్రమే చేస్తున్నామని అప్పట్లో ఆయన స్పష్టం చేశాడు. సుస్మితా సేన్‌తో బ్రేకప్ తర్వాత లలిత్ మోదీ ఇప్పుడు లెబనాన్‌కు చెందిన రీమా బౌరీతో రిలేషన్‌లో ఉన్నాడు. 2025 ప్రేమికుల దినోత్సవం రోజున వీరిద్దరి రిలేషన్‌ను బయటపెట్టారు.


# వైభవ్ సూర్యవంశీ రెమ్యునరేషన్ డబుల్



ఇండియా క్రికెట్ లో సరికొత్త సెన్సేషన్ గా మారిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ క్రేజ్ ఇప్పుడు అమాంతం పెరిగిపోయింది. ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడి 237.30 ఊహించని స్ట్రైక్ రేట్ తో 776 రన్స్ బాదిన ఈ బిహార్ బ్యాటర్ మార్కెట్ ను షేక్ చేస్తున్నాడు. టోర్నమెంట్ లో ఆరెంజ్ క్యాప్ తో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఈ సంచలన పర్ఫార్మెన్స్ తర్వాత మైదానం వెలుపల కూడా అతడి డిమాండ్ డబుల్ అయింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ తో రూ. 1.10 కోట్ల యాన్యువల్ కాంట్రాక్ట్ లో ఉన్న వైభవ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల రూపంలో అంతకు మించి సంపాదిస్తున్నాడు. ఆటోమొబైల్, మీడియా వర్గాల సమాచారం ప్రకారం ఐపీఎల్ స్టార్ట్ అవ్వడానికి ముందు వైభవ్ ఒక్కో బ్రాండ్ డీల్ కోసం దాదాపు రూ. 1 కోటి వరకు ఛార్జ్ చేసేవాడు. అయితే సీజన్ ముగిసేసరికి అతడి ఎండార్స్‌మెంట్ ఫీజ్ ఏకంగా డబుల్ అయింది. ప్రస్తుతం అతడు ఒక్కో కొత్త డీల్ కోసం రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ ఒకరు ఎన్డీటీవీ కి స్పష్టం చేశాడు. ఇప్పటికే కాంప్లాన్, రెడ్ బుల్ లాంటి పెద్ద బ్రాండ్లకు అంబాసిడర్ గా మారిన వైభవ్ తో కొలాబరేట్ అవ్వడానికి మరికొన్ని కంపెనీలు లైన్ లో ఉన్నాయి. చిన్న ఏజ్ లోనే వస్తున్న ఈ సడన్ పాపులారిటీ, బిజినెస్ డీల్స్ ను వైభవ్ సూర్యవంశీ పేరెంట్స్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తున్నారు. అతడి ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ కూడా ఈ విషయంలో ఈ వండర్ కిడ్ మేనేజ్‌మెంట్ టీమ్ కు పూర్తి సపోర్ట్ అందిస్తోంది. ఐపీఎల్ లో సృష్టించిన రికార్డుల కారణంగానే బ్రాండ్లు అతడి వెనుక పరుగులు పెడుతున్నాయని ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. ఒకవేళ భవిష్యత్తులో వైభవ్ ఐపీఎల్ మెగా వేలంలోకి వస్తే ఏకంగా రూ. 30 కోట్ల వరకు బిడ్ దక్కించుకునే ఛాన్స్ ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సాధించిన అచీవ్‌మెంట్స్ చూసి మాజీ క్రికెటర్లు, లెజెండ్స్ అతడిని సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్ లాంటి గ్రేట్ ప్లేయర్లతో పోలుస్తున్నారు. టాలెంట్ పరంగా అతడి హిట్టింగ్ కెపాసిటీ అద్భుతంగా ఉన్నప్పటికీ, కెరీర్ ఇప్పుడిప్పుడే స్టార్ట్ అవుతుండటంతో వచ్చే అవకాశాలను జాగ్రత్తగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐపీఎల్ తెచ్చిన ఈ స్టార్ డమ్ తో ఇండియా క్రికెట్ లో అతడి బ్రాండ్ వాల్యూ సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఒక్క తప్పిదమే పంజాబ్ కింగ్స్ పతనాన్ని శాసించింది

## • రెడిట్‌లో వెల్లడించిన సచిన్ టెండూల్కర్



ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం విచిత్రంగా ముగిసింది. టోర్నీ ఫస్టాఫ్‌లో 7 మ్యాచ్‌లకు 6 గెలిచిన పంజాబ్ కింగ్స్.. మరో మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఐపీఎల్ చరిత్రలోనే తొలి 7 మ్యాచ్‌ల్లో ఓటమెరుగని జట్టుగా సరికొత్త రికార్డ్‌ను లిఖించింది. కానీ తర్వాతి 7 మ్యాచ్‌ల్లో వరుసగా 6 మ్యాచ్‌లు ఓడి ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది. పంజాబ్ కింగ్స్ వైఫల్యానికి గల కారణాన్ని క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ రెడిట్‌లో వెల్లడించాడు. ఫస్టాఫ్ టోర్నీలో పంజాబ్ ప్రక్రియను నమ్ముకుంటే.. సెకండాఫ్‌లో ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి మూల్యం చెల్లించుకుందన్నాడు. ‘పంజాబ్ కింగ్స్ ఈ టోర్నీకి మంచి ఊపును తీసుకొచ్చింది. వారి క్రికెట్ సానుకూలంగా.. ధైర్యంగా.. ఆట స్వరూపాన్నే మార్చేసేలా సాగింది. సుదీర్ఘమైన టోర్నీల్లో మూమెంటమ్ అనేది చాలా కీలక పాత్ర పోషిస్తుంది. వేగంగా సాగే టోర్నీలో అంతా ప్రక్రియపైనే ఆధారపడి ఉంటుంది తప్ప ఫలితాలకు ఎక్కువగా కట్టుబడిపోకూడదు. పంజాబ్ జట్టు ఫస్టాఫ్‌లో ప్రక్రియపై ఎక్కువ దృష్టి పెట్టగా.. సెకండాఫ్‌లో ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెట్టింది.’అని సచిన్ పేర్కొన్నాడు. గుజరాత్ టైటాన్స్ చాలా నిలకడగా రాణించిందని సచిన్ కొనియాడాడు. ‘గుజరాత్ టైటాన్స్ విషయానికి వస్తే.. ఈ సీజన్ మొత్తం ఒకే తరహాలో ప్రదర్శన కనబర్చింది. ఐపీఎల్‌లో ఎప్పుడూ ఏం జరుగుతుందో చెప్పలేం. కానీ గుజరాత్ ఫలితాలు అటు ఇటుగా మారినా.. ఆ జట్టు తమ ఆటతీరును మాత్రం మార్చుకోలేదు. ఫలితాలతో సంబంధం లేకుండా చాలా నిలకడగా రాణించారు. సుదీర్ఘ టోర్నీలో అప్పుడప్పుడు మెరుపు ప్రదర్శనలు చేయడం లేదా ఏదో ఒక మ్యాచ్‌లో ఒంటరి పోరాటంతో గెలవడం కంటే.. ఇలాంటి అనిశ్చితిని నియంత్రించే సామర్థ్యమే చాలా విలువైనదిగా నిలుస్తుంది. ఈ సీజన్‌లోనూ పాయింట్స్ టేబుల్‌లో జట్లు మారాయి. ఫస్టాఫ్ సమయంలో ఉన్నపాయింట్స్ టేబుల్.. టోర్నీ ముగిసే సరికి వేరుగా కనిపించింది. టోర్నీ సాగుతున్న కొద్దీ జట్లు తమ ఆటను మెరుగుపర్చుకున్నాయి.’అని సచిన్ టెండూల్కర్ చెప్పుకొచ్చాడు.

# వచ్చే ఏడాది మార్చి 15 నుంచే ఐపీఎల్

వచ్చే ఏడాది నుంచి ఐపీఎల్ షెడ్యూల్ మారనుందా మార్చి 15 నుంచే టోర్నో మొదలుకానుందా మ్యాచ్‌ల సంఖ్య కూడా భారీగా పెరగనుందా మీడియాలో వస్తున్న ఈ వార్తలపై బీసీసీఐ బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తాజాగా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఐపీఎల్ విండో మార్పు గురించి పెద్దగా ఆలోచించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీసీఐ ఐపీఎల్ మ్యాచ్‌లకు, ప్రేక్షకులకు ఇబ్బంది కలిగిస్తున్న వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడంపై మాత్రమే దృష్టి పెట్టిందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, వర్షాల వల్ల మ్యాచ్‌లకు అంతరాయం కలగకుండా వచ్చే సీజన్ నుంచి టోర్నమెంట్‌ను రెండు వారాల ముందే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఏడాది (2026) ఐపీఎల్ మార్చి 28న ప్రారంభం కాగా, కొన్ని మ్యాచ్‌లపై వర్షం ప్రభావం పడింది. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య జరగాల్సిన ఒక మ్యాచ్ ఫలితం తేలకుండానే వర్షార్పణం అయ్యింది. మరోవైపు వేసవి ఎండల తీవ్రత వల్ల మైదానంలోని ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు చాలా ఇబ్బందులు పడ్డారు. టోర్నమెంట్ జరిగే సమయంలో ఇలా వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంపై బీసీసీఐ ఆందోళన చెందుతోంది. ఓ ప్రముఖ మీడియాతో బీసీసీఐ బోర్డు మెంబర్ దేవజిత్ సైకియా మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచుతారనే ప్రచారాన్ని కొట్టిపారేశారు. “బీసీసీఐ ఈ అంశాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎందుకంటే, గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఐపీఎల్ రెండు నెలల కంటే ఎక్కువ కాలం సాగింది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, ఈ ఏడాది 2 నెలల 2 రోజులపాటు టోర్నమెంట్ జరిగింది. అయితే ప్రస్తుతం బీసీసీఐ బోర్డు మ్యాచ్‌ల సంఖ్య కంటే, వాతావరణ పరిస్థితులపైనే ప్రధానంగా దృష్టి సారించింది” అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. ‘గతేడాది ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత, మధ్యలో ఒక వారం పాటు టోర్నమింట్‌ను నిలిపివేశారు. దీనితో లీగ్ కొద్దిగా పొడిగించబడింది.

# శుభ్‌మన్ గిల్ బెస్ట్ కెప్టెన్

## • అశ్విన్ బెస్ట్ టీమ్ అనౌన్స్ మెంట్



ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత క్రికెట్ లవర్స్ ను ఆకట్టుకునేలా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఒక క్రేజీ అనౌన్స్ మెంట్ చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్ లో ఈ సీజన్ కు సంబంధించిన బెస్ట్ ప్లేయింగ్ 12 టీమ్ ను సెలెక్ట్ చేశాడు. ఈ లిస్టులో ఎవరూ ఊహించని విధంగా గుజరాత్ టైటాన్స్ (+u) కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ను తన టీమ్ కు కెప్టెన్ గా అనౌన్స్ చేశాడు. ఈ సీజన్ మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డు విన్నర్, 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని ఫస్ట్ ఓపెనర్ గా ఎంచుకున్నాడు. వైభవ్ ఈ టోర్నమెంట్ లో 16 మ్యాచుల్లో 237 కి పైగా స్ట్రైక్ రేట్ తో 776 రన్స్ చేసి హయ్యెస్ట్ రన్ స్కోరర్ గా నిలిచాడు. అశ్విన్ టీమ్ లో సెకండ్ ఓపెనర్ గా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిలిచాడు. గిల్ ఈ సీజన్ లో 46 యావరేజ్, 163.02 స్ట్రైక్ రేట్ తో 732 రన్స్ స్కోర్ చేశాడు. ఇక ఈ సీజన్ ఫైనల్ మ్యాచ్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) లెజెండ్ విరాట్ కోహ్లీని నంబర్ 3 పొజిషన్ కు పరిమితం చేశాడు. కోహ్లీ ఈ టోర్నీ అంతటా ఓపెనర్ గా ఆడినప్పటికీ అశ్విన్ మాత్రం అతడిని వన్ డౌన్ లో బ్యాటింగ్ కు దించాడు. విరాట్ కోహ్లీ ఈ సీజన్ లో 56.25 అద్భుతమైన యావరేజ్ తో 675 రన్స్ చేసి తన క్లాస్ పర్ఫార్మెన్స్ ను చూపించాడు. నంబర్ 4 ప్లేస్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ు) స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ను సెలెక్ట్ చేశాడు. క్లాసెన్ ఈ సీజన్ లో 48 యావరేజ్ తో 624 రన్స్ చేశాడు. నంబర్ 5 లో ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ ను ఎంచుకున్నాడు. పాటిదార్ 192.69 స్ట్రైక్ రేట్ తో 500 కి పైగా రన్స్ తో విధ్వంసం సృష్టించాడు. నంబర్ 6 ను ఎస్‌ఆర్‌హెచ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని కేటాయించాడు. నితీష్ 14 మ్యాచుల్లో 300 రన్స్ తో పాటు 8 వికెట్లు తీసి టీమ్ కు మంచి బ్యాలెన్స్ ఇచ్చాడు.

# భారత్, న్యూజిలాండ్ సిరీస్ షెడ్యూల్ ప్రకటన

**కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్**

**రోహిత్, విరాట్‌కు కీలకం కానున్న న్యూజిలాండ్ పర్యటన**

**న్యూజిలాండ్‌తో 12 మ్యాచ్‌లు ఆడనున్న భారత్**

**ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులు**

**అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ జరగనున్న సిరీస్**

టీమిండియా కోసం న్యూజిలాండ్ ఓ భారీ సిరీస్‌ను ప్లాన్ చేసింది. భారత్ – న్యూజిలాండ్ దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కివీస్ ఈ టూర్ ప్లాన్ చేసింది. న్యూజిలాండ్ గడ్డపై 40 రోజుల పాటు క్రికెట్ అభిమానులకు ఓ పెద్ద పండగే అని చెప్పొచ్చు. ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులతో కలిపి మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత్ – న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీమిండియా కోసం కివీస్ ఓ మెగా టూర్ ప్లాన్ చేసింది. ఏకంగా 40 రోజుల పాటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించేలా టెస్టు, టీ 20, వన్డేలతో ఓ మెగా సిరీస్‌నే సిద్ధం చేసింది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు న్యూజిలాండ్‌లో భారత జట్టు పర్యటించనుంది. ఈ టూర్‌లో ఐదు టీ20లు, రెండు టెస్టులతో పాటు ఐదు వన్డేల సిరీస్ కూడా ఉండటం విశేషం.న్యూజిలాండ్ ఇప్పటి వరకు ఆతిథ్యం ఇచ్చిన అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా పర్యటన ఒకటిగా నిలవనుంది. అలాగే ఒకే పర్యటనలో ఓ విదేశీ జట్టుతో న్యూజిలాండ్ ఆడనున్న అత్యధిక మ్యాచ్‌ల సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. భారత్ – న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సిరీస్ నిర్వహించనున్నారు.భారత్ – న్యూజిలాండ్ మధ్య ఈ సిరీస్ అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. క్రైస్ట్ చర్చ్ వేదికగా అక్టోబర్ 22న తొలి టీ20 మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభమవుతుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అనంతరం నవంబర్ 4 నుంచి ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా వన్డే సిరీస్ స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత నవంబర్ 19 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనున్నారు. నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్‌లో తొలి టెస్టు, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో రెండో టెస్టు నిర్వహిస్తారు. భారత్ చివరిసారిగా 2019 – 20 సీజన్‌లో టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు వెళ్లింది. ఆ తర్వాత మళ్లీ న్యూజిలాండ్ రెండుసార్లు భారత్‌లో పర్యటించింది.



ముఖ్యంగా 2024–25లో 3– 0తో క్లీన్ స్వీప్ చేసింది. రోహిత్, కోహ్లి టెస్టు రిటైర్మెంట్‌కు బీజం పడింది కూడా ఈ సిరీస్ నుంచే! అయితే కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్ ఆడనుంది. 2019లో న్యూజిలాండ్‌లో భారత్ చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడింది. ఇక 2022 తర్వాత ఆ దేశంలో భారత్ ఆడుతున్న తొలి వైట్ బాల్ సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. 2022 నవంబర్‌లో కివీస్‌లో టీమ్ఇండియా వన్డే సిరీస్ ఆడింది. ఆ తర్వాత మళ్లీ ఈ పర్యటనతోనే కివీస్ గడ్డపై టీమ్ఇండియా ఆడనుంది. మరోవైపు స్టార్లు రోహిత్, విరాట్‌కు తమ కెరీర్‌లో ఇదే ఆఖరి న్యూజిలాండ్ పర్యటన అయ్యే అవకాశం ఉంది. టీ20, టెస్టులకు గుడ్‌బై చెప్పేసిన ఈ స్టార్లు వన్డే ఫార్మాట్‌లోనే ఆడుతున్నారు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరికి తమతమ కెరీర్‌లో మరోసారి న్యూజిలాండ్‌లో ఆడే అవకాశం రాకపోవచ్చు!మరో మూడు రోజుల్లో టీమ్ఇండియా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో మళ్లీ సందడి చేయనుంది. భారత్ పర్యటనకు అఫ్గానిస్థాన్ రానుంది. ఈ టూర్‌లో ఏకైక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. జూన్ 06న టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు ముల్లాన్‌పుర్ వేదిక కానుంది. ఆ తర్వాత జూన్ 13న ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. జూన్ 17న రెండో, 20న మూడో వన్డేలో అఫ్గాన్– భారత్ ఢీ కొట్టనున్నాయి.న్యూజిలాండ్‌లో భారత పర్యటన పూర్తి షెడ్యూల్‌టీ20 సిరీస్‌మొదటి టీ20 – అక్టోబర్ 22, క్రైస్ట్ చర్చ్. రెండో టీ20 – అక్టోబర్ 24, క్రైస్ట్‌చర్చ్. మూడో టీ20 – అక్టోబర్ 27, వెల్లింగ్టన్. నాలుగో టీ20 – అక్టోబర్ 30, ఆక్లాండ్. ఐదో టీ20 – నవంబర్ 1, హామిల్టన్.వన్డే సిరీస్:మొదటి వన్డే – నవం బర్ 4, ఆక్లాండ్. రెండో వన్డే – నవంబర్ 7, వెల్లింగ్టన్. మూడో వన్డే – నవంబర్ 10, హామిల్టన్. నాలుగో వన్డే – నవంబర్ 13, మౌం ట్ మాంగనుయ్, ఐదో వన్డే – నవంబర్ 15, మౌంట్ మాం గనుయ్.టెస్టు సిరీస్:మొదటి టెస్టు – నవంబర్ 19–23, వెల్లిం గ్టన్. రెండో టెస్టు – నవంబర్ 27 – డిసెంబర్ 1, క్రైస్ట్ చర్చ్.

# రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ డ్యాన్స్ మాస్టర్ పండు



ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ పండు (జి.షణ్ముఖ) రోడ్డు ప్రమాదానికి గురైన వార్త బుల్లితెర వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. విశాఖపట్నం జిల్లా ఆనందపురం వద్ద నిన్న అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తాజాగా అతడి ఆరోగ్య పరిస్థితిపై విశాఖలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు మీడియాకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.

ఈ ప్రమాదంలో పండు రెండు కాళ్లకు చాలా తీవ్రమైన గాయాలు అయ్యాయని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం అతడికి ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నామని, అన్ని రకాల వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం అతడి కాళ్లకు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం పండు కనీసం ఆరు నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకుంటేనే మళ్లీ కోలుకుని, సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేశారు. మరోవైపు, ఈ ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై ఆనందపురం పోలీసులు ఆసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పండు త్వరగా కోలుకోవాలని అతడి అభిమానులు, బుల్లితెర ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు

# రణ్‌వీర్ సింగ్ వివాదం.. వెనక్కి తగ్గిన ఫిల్మ్ ఫెడరేషన్



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు, ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ)కు మధ్య నడుస్తున్న వివాదం కీలక మలుపు తిరిగింది. రణ్‌వీర్‌పై జారీ చేసిన సహాయ నిరాకరణ ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ నేడు అధికారికంగా ప్రకటించింది. సినీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (సీఐఎన్‌టీఏఏ), ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐఎంపీపీఏ) చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు బీఎన్ తివారీ తెలిపారు. ఈ ప్రకటనకు ఒకరోజు ముందే రణ్‌వీర్ సింగ్.. ఫెడరేషన్‌కు లీగల్ నోటీసు పంపడం గమనార్హం.

ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్ అశోక్ పండిట్ మాట్లాడుతూ.. రణ్‌వీర్ పంపిన లీగల్ నోటీసు తమకు అందిందని, దానికి తమ న్యాయ బృందం సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. "ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనేందుకు రణ్‌వీర్‌ను చర్చలకు ఆహ్వానిస్తున్నాం. ఆయన స్టార్‌డమ్‌ను మేం గౌరవిస్తాం. ఎవరినీ నిషేధించే అధికారం మాకు లేదు. రణ్‌వీర్ నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన అన్నారు.

### వివాదం నేపథ్యమిదే!

ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో తెరకెక్కాల్సిన 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ సింగ్ చివరి నిమిషంలో తప్పుకోవడమే ఈ వివాదానికి అసలు కారణం. గత ఏడాది డిసెంబర్‌లో 'ధురంధర్' సినిమా విడుదలైన తర్వాత ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. దీంతో మే 25న ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ఆయనపై సహాయ నిరాకరణ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యను పలువురు సినీ ప్రముఖులు తప్పుబట్టారు.

ఈ నేపథ్యంలో ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా కూడా తీవ్రంగా స్పందించింది. నటీనటులు, టెక్నీషియన్లు చివరి నిమిషంలో ప్రాజెక్టుల నుంచి తప్పుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని, దీనివల్ల నిర్మాతలకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. 'డాన్ 3'తో ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్, 'దృశ్యం 3' నుంచి అక్షయ్ ఖన్నా వైదొలగడంతో పనోరమా స్టూడియోస్ నష్టపోయిన విషయాన్ని ప్రస్తావించింది. ఇలాంటి చర్యలు పరిశ్రమలో నమ్మకాన్ని, వృత్తి నైపుణ్యాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించింది.

మరోవైపు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చర్యను సవాలు చేస్తూ ప్రముఖ నిర్మాత, ఐఎంపీపీఏ మాజీ అధ్యక్షుడు టీపీ అగర్వాల్ కోర్టును ఆశ్రయించారు. ఏ వ్యక్తిని లేదా సంస్థను బహిష్కరించే అధికారం ఏ ట్రేడ్ బాడీకి లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై కూడా తమ న్యాయ బృందం స్పందిస్తుందని అశోక్ పండిట్ తెలిపారు. మొత్తంగా, సహాయ నిరాకరణ ఉత్తర్వులు వెనక్కి తీసుకున్నప్పటికీ, ఈ వివాదం చుట్టూ న్యాయపరమైన, పరిశ్రమపరమైన చర్చలు కొనసాగుతున్నాయి.

# ఇకపై ప్రేక్షకులను మోసం చేయలేం..

## వాళ్లు చాలా అప్‌డేట్ అయ్యారు: పూజా హెగ్డే



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే థియేట్రికల్ సినిమా ప్రస్తుత పరిస్థితిపై చేసిన కొన్ని ముక్కుసూటి వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పూజ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ప్రేక్షకులు ఎంతగానో అప్‌డేట్ అయ్యారని, సినిమా ఎంపికలో ఎంతో నిశితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. థియేటర్లలో సినిమా చూసేటప్పుడు అది నిజంగా ఎంటర్‌టైన్ చేస్తుందా లేదా అనేది మొదటి కొన్ని నిమిషాల్లోనే ప్రేక్షకులు జడ్జ్ చేయగలరని ఆమె అభిప్రాయపడ్డారు."ఇకపై మనం నకిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను మోసం చేయలేం. థియేటర్లలో ఏ సినిమా చూడాలో ఎంచుకునే విషయంలో వారు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. ఒక సినిమా వారి హృదయానికి కనెక్ట్ అవుతుందా? లేదా? అనేది ప్రేక్షకులు చాలా త్వరగా గ్రహిస్తున్నారు" అని పూజా హెగ్డే స్పష్టం చేశారు. కమర్షియల్ సినిమాల్లో నటించేటప్పుడు గ్లామర్, ఎమోషన్, కామెడీ, డ్యాన్స్, నటన.. ఇలా అన్నింటినీ ఒకేసారి పర్ఫెక్ట్‌గా డెలివరీ చేయడం నటీనటులకు ఒక పెద్ద సవాల్ అని ఆమె పేర్కొన్నారు. దీనికి తోడు ఓటీటీ, రీల్స్ వంటి షార్ట్-ఫార్మ్ కంటెంట్ నుండి వస్తున్న గట్టి పోటీ కారణంగా థియేట్రికల్ రిలీజ్ అనేది మేకర్స్‌కు ఒక నిజమైన పరీక్షగా మారిందని ఆమె విశ్లేషించారు.అయితే ఈ సవాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ, బిగ్ స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్‌పై పూజ పూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. థియేటర్లలో అందరితో కలిసి నవ్వుతూ, చప్పట్లు కొడుతూ, డ్యాన్స్ చేస్తూ సినిమా చూడటంలో ఉండే ఆనందమే వేరని.. ఆ సామూహిక అనుభూతిని ఓటీటీలో ఒంటరిగా చూస్తూ ఎప్పటికీ పొందలేమని ఆమె చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ పరిశ్రమల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న పూజా హెగ్డే.. త్వరలోనే 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.




# 'పెద్ది' కోసం పవన్ స్పెషల్ వీడియో!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన 'పెద్ది' సినిమాపై అంచనాలు పెరుగుతున్న వేళ.. జనసేన అధినేత, చెర్రీ బాబాయ్ పవన్ కల్యాణ్ ఆ చిత్రానికి తన మద్దతు తెలిపారు. 'పెద్ది' టీమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ 'ఎక్స్' ఖాతా ద్వారా విడుదలైన ఈ వీడియోలో రామ్ చరణ్ సినీ ప్రయాణంలోని పలు ముఖ్యమైన సన్నివేశాలను పొందుపరిచారు. రామ్ చరణ్ అనే పేరులోనే శ్రీరామభక్తుడైన హనుమంతుడి లక్షణాలు ఉన్నాయని, ఆయన భక్తి, శక్తి, సమర్పణ భావాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పోలిక అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రం రేపు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉండగా, పవన్ స్వయంగా వీడియో విడుదల చేయడం ఆ అంచనాలను మరింత పెంచింది. 'పెద్ది' సినిమా మార్గంలో ఎలాంటి అడ్డంకులు ఎదురవకుండా ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని, ఈ చిత్రం ఘన విజయం సాధించి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించాలని పవన్ కల్యాణ్ తన వీడియోలో ఆకాంక్షించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# 'స్పిరిట్' సెట్స్ నుంచి ప్రభాస్ ఫొటో షేర్ చేసిన స్టైలిస్ట్..

## ఇంటర్నెట్‌లో రచ్చ!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'స్పిరిట్' సెట్స్ నుంచి ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఓ ఫోటో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉండగా, ఈ ఫోటో వాటిని మరింత పెంచింది.వివరాల్లోకి వెళితే, 'స్పిరిట్' చిత్ర బృందంలోని హెయిర్‌స్టైలిస్ట్ ఒకరు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రభాస్ ఫోటోను షేర్ చేశారు. ఇందులో ప్రభాస్ ఎంతో స్టైలిష్‌గా బ్లాక్ డ్రెస్‌లో కనిపించారు. అయితే, పోస్ట్ చేసిన కొద్దిసేపటికే ఆ ఫోటోను డిలీట్ చేశారు. కానీ అప్పటికే ఆ ఫోటో స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

నిజానికి ఈ ఫోటో మే 26న తీసిందని తెలిసినప్పటికీ, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. ఈ కొత్త లుక్‌పై ఫ్యాన్స్ నుంచి భారీ స్పందన వస్తోంది. తమ హీరోను కొత్త అవతార్‌లో చూసి మురిసిపోతూ, వెంటనే సినిమా నుంచి అధికారిక ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం 'స్పిరిట్' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని విమల్ థియేటర్, బాలానగర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఈ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సరసన తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ ప్రధాన విలన్‌గా కనిపించనున్నారు. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# ఇరుముడి తాజా గ్లింప్స్ విడుదల




మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి'ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన ఎమోషనల్ బాండింగ్ చుట్టూ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తాగుడికి బానిసైన తండ్రి ఆ వ్యసనానికి దూరమవ్వడం కోసం అయ్యప్ప మాలా వేసిన అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. అయ్యప్ప స్వామి భక్తి, అయ్యప్ప మాల నేపథ్యంతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆధ్యాత్మికత, ఫ్యామిలీ ఎమోషన్స్ సమానంగా ఉండేలా రవితేజను ఒక సరికొత్త రిఫ్రెషింగ్ అవతార్‌లో చూపించబోతున్నాడు శివ నిర్వాణ. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర, ఇతర కీలక పాత్రల్లో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జులై లేదా ఆగస్టు 2026లో భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.